పురాణపండవారి

# సంపూర్ణ రామాయణం



పారాయణ గ్రంథం

మోహన్ పబ్లికేషన్స్, రాజమహేంద్రవరము

# సంపూర్ణ రామాయణము

## బాలకాండము

**ఆపదలు బాప, సంపద**
**లేపారింపనుజగమభివృద్ధి పథవలనన్**
**రూపింప ? నిన్ను శ్రీరా**
**మా ! పరమగుణాభిరామ ! మరిమరిగొల్తున్**

శ్రీలు పండిస్తూ, యుద్ధభటులకు సాధింప వీలులేని అయోధ్యానగరమును దశరథమహారాజు రాజధానిగాచేసుకొని, ప్రజలను తనకన్న ప్రజలకన్నా మిన్నగా పాలిస్తున్నాడు. ఆతనిపాలనలో లేమి లేకుండా పోయింది. కౌసల్య-కైక-సుమిత్ర అను ఆ రాజు ముగ్గురుభార్యలు భర్తకు అనుగుణముగా మసలుతున్నారు. ప్రజాగౌరవాన్ని సంపాదించుకున్నారు. సత్య-ధర్మాలను ఆచరిస్తున్న రాజును చూసి ప్రజలందరూ సత్యవంతులు, ధర్మపరాయాణులయి, ఆదేశము సుఖ శాంతులతో వర్ధిలుతోంది.

రాజు ధర్మవంతుడు. అందువలన నెలకు మూడువర్షాలుపడి భూమాత సస్యశ్యామలమై, పశుసంపత్తి అమృతక్షీర వర్షాన్ని వర్షిస్తున్నది, మహారాజు యజ్ఞ యాగాలు చేస్తుండడమువలన దేవతలు మెచ్చి ఆరాజ్యాన్ని సమస్త ధన ధాన్యాలతో నింపి పోషిస్తున్నారు.

మహర్షులు గౌతమ–జాబాలి–వామదేవాదులు దశరథ మహారాజుచేత ధర్మకర్మలు సశాస్త్రీయంగా యాగాలుచేయించి ఆశీస్సులిచ్చి ఆయన పరిపాలనలో యేలోపమూ లేకుండాచూస్తున్నారు.

సుమంత–రాష్ట్రవర్ధన– విజయ–సురాష్ట్ర–జయంత– ధృష్టి–అమోఘ– కాశ్యప అష్టమంత్రులు– అష్టదిక్కులనూ జయింపచేయ గల రాజకీయ మంత్రాంగాన్ని, మహనీయముగా మహిమోపేతముగా – మంగళదేవత గజ్జెకట్టి ఆదేశములో నర్తించునట్లు– సూర్యవంశ్యుడైన దశరథ మహారాజుచేత పరిపాలింప చేస్తున్నారు. ఇహ–పరలోక సుఖాలు ఆతడు పొందేలాగు చూస్తున్నారు. అందువలన ఆతనికీర్తి అమరలోకము వరకూ ఆక్రమించింది. అందువలన ఆ మహేంద్రుడాతనికి పరమాప్తుడయ్యాడు.

అన్నీ ఆతనికున్నా సంతానములేక అవన్నీ శూన్యంగా కాన్పిస్తున్నాయి. సంతానహీనుల మోము చూడకూడదని మనవారంటుంటారు.

## పుత్రకామేష్టి యాగము

దశరథ మహారాజుకు భగవానుడైన వశిష్ఠ బ్రహ్మర్షి గురువు. సూర్యవంశానికే కులగురువు–మంత్రుల–కవి–పండితులతో సమావేశమయి " అశ్వమేధయాగాన్ని" చేయడానికి నిర్ణయము గావించి– దానితో" పుత్రకామేష్టియాగాన్ని చేయాలని, దాని వలన తప్పక సంతానము కలుగుతుందని నమ్మాడు.

విభాండక మహర్షి కూమారుడు ఋష్యశృంగుడు మహా తపస్వి – ఆతడు కశ్యప ప్రజాపతి వంశమువాడు – బ్రహ్మచర్య వ్రత దీక్షా దక్షుడు–మహాతపశ్శాలి. తన తండ్రి ఆశ్రమానికి వచ్చిన మహర్షులనే కాని స్త్రీలనే ఎరుగక ప్రపంచ వాసనలే అంటని పరబ్రహ్మ స్వరూపుడాతడు.

రోమపాదుడనే మహారాజు అంగదేశాన్ని పాలిస్తున్నాడు. ధర్మకర్మలను ఆచరించక మహాపురుషులను మన్నింప నందున ఆతని రాజ్యములో కరువు కరాళ రాక్షసి వికటాట్టహాస వికృత రూపముతో తాండవము గావించింది. దుర్భరమైన కరువూ కాటకాలతో ప్రజలు అలమటింప సాగారు. ఆరాజు ఋష్యశృంగ మహర్షిని తనరాజ్యానికి తీసుకువచ్చాడు. మహర్షి అంగరాజ్యములో పాదము పెట్టే సరికి భోరున వర్షం కురిసింది. భూమి సస్యశ్యామల మయింది. అందువలన ఆతనిని మనము తీసుకొచ్చిన తప్పక నీకు సంతానం కలుగుతుందని వశిష్ఠబ్రహ్మర్షి చెప్పగా దశరథ మహారాజు ఆమహర్షిని తీసికొని రావడానికి వేశ్యామణులను పంపాడు.

విభాండకుడు ఆశ్రమములో లేని సమయంలో దశరథమహారాజు పంపిన వేశ్యలు ఋష్యశృంగమహర్షి ఆశ్రమములో ప్రవేశించారు. ఆయన వారికి ఎదురేగి వందనలాచరించాడు. "ఆహా! దివ్యర్షులారా! మీయాశ్రమాలెక్కడ? యేమి మీ

శరీరాల సువాసన? ఈ సువాసన యేవృక్షాల్లో లభించింది? అన్నిటి కన్నా మీ తపస్సు యెంతగొప్పదో కదా! మీ రొమ్ములుకు రెండేసి కొమ్ములున్నాయి. ఇవి యేతపస్సు వలన మీకు సిద్ధించాయి? నాకు ఒకకొమ్మేఉంది. అదైనానాకు తలపై ఉంది. మీకు మీవక్షస్థలము పై ఉన్నాయి. మీరు నాకన్నా గొప్పతాపసు లనడానికి యింతకన్నా సాక్ష్యాలేమున్నాయి" అని ఋష్యశృంగుడు అర్ఘ్యపాద్యాలిచ్చాడు. ఆవేశ్యలు ఆతని అమాయికత్వానికి కిల కిల నవ్వుతూ, తమ హావభావవిలాసాల్లో ఆతనిని ఎత్తికొని ముద్దాడి తిన్నగా ఆతనిని ఆయోధ్యకు తీసికొని వచ్చారు. ఇంకేముంది ! ఆమహర్షిఅయోధ్యపొలిమేరల్లో అడుగు పెట్టే సరికి కుంభవృష్టి కురిసింది. వసంతము తనవిలాసాన్ని చూపించింది. అప్పుడు ఋష్యశృంగ మహర్షి ఆజ్ఞను శిరసావహించి దశరథమహారాజు – యాగశాలను నిర్మింపచేశాడు శిల్పులు యాగశాలను తమ అనల్ప శిల్ప మహిమతో చూపరులుకు కనువిందుచేసేలాగు అలంకరించారు. దేశము నలుచెరగులా ఒకవత్సరము కొనసాగే యాగానికి రమ్మని దశరథ మహారాజు రాజులకూ–మంత్రిదండనాథులకూ– జానపదులకూ – విద్వత్కవి పండితులకూ ఆహ్వానాలు పంపారు. వారందరూ అయోధ్యానగరానికి వచ్చారు.

ఆమహత్తర యాగము జరుగు సంవత్సరకాలము నిర్విరామముగా అన్న దానము జరగడానికి మంచి క్షమా గుణసంపన్నులను నియమించారు. యాతాయాత జనులకు మధుర హాసా లొలికిస్తూ, వచ్చిన వారు హాయిగా తిని వెళ్లేవరకూ వారిని బాగా ఆదరించే వారినే వడ్డన దగ్గర నియమించాడు మహారాజు.

యాగాన్ని చూడ్డానికి వచ్చిన వేనవేల – మహర్షులను – మునులను బాగా సత్కరించడానికి మహాత్ములు నియమింపబడ్డారు.

భీష్మ గ్రీష్మ ఋతు సుందరి మందహాసముచేస్తూ వచ్చిపోయింది. కుంభవృష్టిని కురియించి భూమిని సస్యశ్యామలంచేసి వర్షఋతుకాంత ఆనందముతో యాగాన్ని తిలకించి మందగమనంతో వెళ్ళింది. తెల్లని చల్లని వెన్నెలకాంతులు భూమాతపై ఒలక బోసి ముసి ముసి నగవులతో ఆనంద రామణీయకంగా శరదృతువు నారీలలామ ఒయ్యారంగా వచ్చి పోయింది. హేమంతశ్యామల అనురాగరసాన్ని చిందిస్తూ, అందరినీ గజగజ లాడించి అలరించి ఎంతో చక్కగా వెళ్లింది. శిశిర ఋతువు పూబోడి వృక్షాల ఆకులన్నీ భూదేవికి కాన్కగా రాల్చి మందమంద గమనాన సాగింది. ఇంక వసంత సుందరాంగి మన్మథ సామ్రాజ్య పట్టమహిషిగా వచ్చింది. అంతలో యాగాశ్వము విశ్వజయముతో యాగశాల దగ్గరకు ఠీవిగ వచ్చింది.

వేదవేదాంగ వేత్తలు సమస్త శాస్త్రాలూ చదివిన వారూ యాగాన్ని తిలకించ డానికి వచ్చిన వారందరి హృదయాలలో నిలిచేలాగు తమ విద్వత్తును ప్రదర్శిస్తూ యాగము గూర్చి ఉపన్యసిస్తున్నారు. చూపరు లానంద నయనాలతో తిలకించి పులకిస్తున్నారు.

ఇరువదియొక్క యూపస్తంభాలు యిరువది యొక్క మూరలుగలవి నాటించారు. ఎనిమిది కోణాలుగల ఆస్తంభాలను పసూపూ గంధాలతో బాగా అలంకరించి ఆవిజయాశ్వాన్ని యూపస్తంభము దగ్గర నిలిపేరు. వాడి గల మూడుకత్తులతో దాన్ని ఛేదించారు. దానిలోగల వప తీసి యాజకుడు వండాడు. తక్కిన దానిశరీరభాగాలన్నీ హోమాగ్నిలో హోమం చేసేరు.

దశరథ మహారాజు ఆ వపాధూమాఘ్రాణంచేసి అనంతరం పాదాలను కడుక్కున్నాడు. వేదచోదితముగా మూడుదినాలు అశ్వమేధయాగము గావించిన మహారాజు యాగంశాస్త్రోక్తముగా తూర్పుభాగము హోతకు; పడమర దిశ అధ్వర్యునికి; ఉత్తర దిక్కు ఉద్గాతకు; బ్రహ్మణ్యులకు దక్షిణ దిశను ధారాదత్తం గావించాడు.

అందరూ ఆనందంగా ముక్తకంఠంతో "మహారాజా! రాజ్య పాలనా భారము మాత్రం మీదే. రాజ్యభారాన్ని మేము మోయగలమా? వేదవేదాంగాలతో శాస్త్రాలను బోధించడమే మాకు తెలిసిన విద్య. మరల ఈ యావద్రాజ్యాన్ని మీరేగైకొనండి" అని అర్థించారు. అప్పుడు మహారాజు వారందరికీ నవరత్న స్థగిత నూతన సువర్ణ భూషణాలు, పాడి పశుగణాలనూ–సమర్పించాడు. ఆమాహత్తర యాగాన్ని తిలకించడానికి వచ్చిన వారందరికీ ముఖ్యంగా వేదవేత్తలకూ–కవిపండితులకూ–ధనకనక వస్తువాహనాలను షోడశదానాలు ఆనందంతో గావించాడు.

## యాగ పాయసం

పుత్రకామేష్టి వైభవంగా ముగిసింది. ఇలా జరుగుతుండగా ఆహోమ గుండము మధ్యలో ప్రాజాపత్యపురుషుడు లేచి సువర్ణ కలశం నిండా పాయసం గల పాత్రను దశరథమహారాజుకు ఇచ్చి – "సూర్యవంశాభరణా! మీ యాగానికి సంతోషించి యీదివ్యమాహత్తర కలశాన్ని ప్రాజాపత్యపురుషుడు తన కరుణాకటాక్షముతో అనుగ్రహించాడు. దీనిలో గల పాయసం సంతానానికి సర్వసంపదలకూ–కారణ మవుతుంది. నీ భార్యలు దీనిని సేవించి గుణయోగశక్తి తేజో భాస్వంతులైన. సుకుమారులను గాంచుతారు" అని అదృశ్యుడైనాడు. ఇక దశరథ మహారాజు నందన వన పారిజాత పరీమళాన్ని ఆనందాన్ని అందుకొన్నాడు. తనభార్యలు ముగ్గురకూ ఈ విషయాన్ని తెలిపేడు. వారి మోములు శరత్కాల చంద్రుని జూచినట్లు వికాసము గాంచాయి. పాత్రలోగల సగము పాయసాన్ని కౌసల్యాదేవికిచ్చాడు. తక్కిన సగాన్ని రెండుభాగాలు చేసి కైకాదేవికి–సుమిత్రా దేవికి ఇచ్చాడు. వారు మంచి పావనభావనలతో దాన్ని సేవించారు.

రాణులు ముగ్గురూ గర్భాలు ధరించారు. ఇలా తొమ్మిది మాసాలు గడిచాయి. పదియవమాసం చైత్రం ఆనందంతో వచ్చింది. పునర్వసు నక్షత్రాన నవమితిథినాడు బృహస్పతీ చంద్రులు కర్కాటకమున ఉచ్చస్థానములో ఉండగా కౌసల్యాదేవి

ప్రసవించింది. పునర్వసు వెళ్లి పుష్యమీనక్షత్ర పాదముండగా మీనలగ్నాన కైకాదేవి ప్రసవించింది. ఆశ్లేషా నక్షత్రాన కర్కాటక లగ్నాన సుమిత్రాదేవి యిద్దరు బిడ్డలను ప్రసవించింది.

అయోధ్యానగరమంతా మహారాజు పుత్రవంతుడైనాడని ఆనందోత్సవాలు ఇంటింటికీ జరుపుకున్నారు. దశరథమహారాజు వేదవేత్తలకూ–కవులకూ–పండితులకు విరివిగా బహుమతులను సమర్పించాడు.

పన్నెండవ రోజున పురిటి పవిత్రశుద్ధి తరువాత మహారాజు తనజ్యేష్ఠపుత్రునకు "రాముడను" నామము; ద్వితీయునకు "భరతుడను" పేరు; సుమిత్రాదేవి పుత్రులకు "లక్ష్మణు" డనీ–"శత్రుఘ్ను" డనీ నామకరణము గావించాడు.

ఆనలుగురు కుమారులూ శుక్లపక్ష చంద్రుని వలే దిన దిన ప్రవర్ధమానులయి–వశిష్ఠబ్రహ్మర్షి దగ్గర సశాస్త్రీయంగా విద్యాబుద్ధులు నేర్చేరు.

నలుగురు రాజకుమారులు మంచిజాతి అశ్వాలపై స్వారీచేయడం మదపుటేనుగులను మచ్చిక చేసికోవడం అస్త్రశస్త్రాల ప్రయోగోపసంహారాల్లో అద్భుతమైన ప్రతిభా పాటవాలతో అత్యద్భుతంగా సమస్త శాస్త్రవిద్యల్లో ఆరితేరడము చూసి దశరథ మహారాజు పులకిత గాత్రుడయ్యాడు.

తన నలుగురు తనయులలో శ్రీరాముడంటే ఎనలేని ప్రేమాభిమాన రాగరంజిత హృదయారవిందుడయ్యేవాడు మహారాజు. పదహారేళ్ల వయస్సువచ్చింది శ్రీరామునకు.

## విశ్వామిత్రునిరాక

"శ్లో॥ అహం వేద్మి మహాత్మానం–రామం సత్యపరాక్రమం వశిష్ఠోపి మహాతేజా–యే చేమే తపసిస్థితాః" దశరథ మహారాజు వివాహ వయస్సుగల పుత్రులనుజూచి మంత్రి సామంత పురోహితులతో దర్బారుతీర్చాడు. ఇంతలో బ్రహ్మర్షిచంద్రుడు విశ్వామిత్రుడు వచ్చి సింహద్వారము దగ్గరవేచి ఉన్నాడని ద్వారపాలకుడు వచ్చి భయభక్తులతో మహారాజుకు విన్నవించాడు.

దశరథ మహారాజు తనముందు వశిష్టులవారు నడువ ఎదురేగి పురోహితుల వలన అర్ఘ్యపాద్యాదు లామహర్షికి సమర్పింప చేశాడు. తోడ్కొని వచ్చి ఆతనిని ఉచితాసనాశానుని గావించాడు.

విశ్వామిత్ర మహర్షి క్షేమ సమాచారా లడిగిన తరువాత "మహాత్మా! తమదివ్య కటాక్షము చేత మాగృహము–మారాజ్యము క్షేమంగా నున్నాయి. తమరాక పాలసముద్రమునకు చంద్రోదయము లాగుంది. తమకు నావలన యేదేని పనికలిగిన శిరోధార్యంగా స్వీకరించి నెరవేరుస్తాను. అనుగ్రహించండి–" అన్నాడు మహారాజు.

విశ్వామిత్రమహర్షి ఆనందించి "దశరథా! సూర్యవంశములో జన్మించావు. బ్రహ్మర్షి యైన యీవశిష్ఠుని కృపతో రాజ్యపాలన గావిస్తున్నావు. నీవంటి ఉత్తమ గుణసంపన్ను డేడి? నాహృదయంలో గలకోరిక తీరుస్తానసుట నీకేచెల్లింది.

జాగ్రత్తగావిను. లోకకల్యాణర్థము నేనొకయజ్ఞము గావింపనెంచాను. కాని ఆయాగంలో రాక్షసులిద్దరు హోమాగ్నిలో రక్తమాంసాలు వేసి యాగాన్ని పాడుచేస్తున్నారు. నాకు శక్తిఉన్నా ఆసమయములో శమనముతో ఉన్న నేను వారిని శపింపరాదు. నీ పెద్ద కుమారుడు శ్రీరాముని నాతో పంపితే నాశిక్షణలో ఆతని స్వయం ప్రతిభతో వారిని సంహరించి నాయాగరక్షణ గావిస్తాడు. దానివలన ఆతనికి గొప్పకీర్తివస్తుంది. ఆ మారీచ సుబాహులను వధించడానికి శ్రీరాముడే సమర్థత గలవాడు. నీవు పుత్రాభి మానముతోనామాట కాదనక నావెంట పంపు. శ్రీరాముని దివ్యసత్యపరాక్రమ విక్రమాది బాహుబల సంపత్తి నాకు తెలుసును. మీ వంశగురువు వశిష్టమాహర్షి, యిచట గల తపోనిధు లందరూ శ్రీరాముని శక్తిని బాగా తెలిసినవారు.

లోకములో నీకీర్తీ జయమూ శాశ్వతంగా నిలుస్తాయి. మీ మంత్రి వర్యులతో- ఆలోచించి శ్రీరాముని నాతో పంపించు నాయాగము తొందరగా పూర్తిగావించాలి. తప్పకపంపించ" మన్నాడు. ఆమాటలు విన్న దశరథునకు తలపై పిడుగు పడినట్లయింది. వేదనాభరమైన విషాదముతో మనసు పరిపరి విధాల పోగా సింహాసనము నుండి క్రిందికి దిగాడు.

"మహాత్మా! నాశ్రీరామునకు సరిగా పదహారు సంవత్సరాలు రాలేదు. అతనికి బదులుగా సేనతో నేనువచ్చి ఆరాక్షసులను అంతము చేస్తాను. తమ యాగాన్నిపూర్తి చేయిస్తాను. అంతేకాని శ్రీరాముని మాత్రము పంపలేను. నాబిడ్డను విడిచి క్షణము జీవింపలేను. ఎవరాదుష్టులు? వారెంతటివారో! వారిబలపరాక్రమము లెంతటివో తమరు నాకు తెలుపండి?" అనగా!

"మహారాజా! పులస్త్యబ్రహ్మ పుత్రుడు విశ్రవసుడు ఆతని సుతుడు రావణుడు. కుబేరునికి ఆతడు సోదరుడు మహత్తర తపస్సుచేసి బ్రహ్మదేవుని వలన పొందరానివరాలు పొంది ఆవర బల గర్వముతో లోకాలన్నిటినీ బాధిస్తున్నాడు. ఆరావణుని స్నేహితులే యీ మారీచ సుబాహులు" అనగా!

"మునీంద్రా! అంత తపో బలంగల ఆరావణుని నేను యెదిరించ గలనా? అలాంటప్పుడు నాపసివాడు శ్రీరాముడేమి చేయ గలడు? తమరు నాపైకృపచూపి నాకుమారుని పంపమని అనకండి?" అన్నాడు.

విశ్వామిత్రుడు- దశరథా! సూర్య్య వంశంలో పుట్టావు. హరిశ్చంద్రునికి వారసుడవు. అటువంటి నీవు ఆడిన మాట తప్పుతావా? అసత్యానికి ఒడిగట్టుకొంటే నీకుమారునితో నీవు యిక్కడ హాయిగాఉండు.

అలావారిద్దరూ వాగ్వాదము గావింప ఆమాటలలో అంతరార్థము గ్రహించిన వశిష్ఠ బ్రహ్మర్షి" దశరథ మహారాజా! సత్యవ్రతుడైన హరిశ్చంద్రుని వంశంలో ఉద్భవించావు. అసత్యానికి యెందుకు భయపడవు? శ్రీరామునికి యేప్రమాదము రాదు. మీదుమిక్కిలి ప్రమోదంతో సమస్తకల్యాణాలూ వరిస్తాయి. యీబ్రహ్మర్షితో తక్షణము నీకుమారుని పంపించు. యీమహర్షివర్యుడు బ్రహ్మర్షియేకాదు సమస్త అస్త్రశస్త్ర విద్యలూ యీతనిని వరించాయి. యీతడు నూతన అస్త్రాలనూ సృష్టిస్తాడు. నీకుమారునికి యెంతో మహాయోగాన్ని యీయనుగలడు" అను వశిష్ఠులవారి మాటలు వినిన దశరథమహారాజు శ్రీరామలక్ష్మణులను విశ్వామిత్ర మహర్షికి అప్పచెప్పాడు. విశ్వామిత్రుడు రామలక్ష్మణులతో వెళ్లు తున్నాడు. మందమలయానిలం సుగంధంతో వీస్తోంది.

బ్రహ్మదేవుని వెనకాల దేవ వైద్యులు అశ్వినీదేవతల్లాగ విశ్వామిత్రుని వెనుక రామలక్ష్మణులు సరయూనది దగ్గరకు వచ్చారు.

మాహర్షి శ్రీరాముని సరయూనదిలో శిరః స్నానముగావించి "బల–అతిబల" అను మహావిద్యలు సకీలకమంత్రయుతముగా ఉపదేశించాడు.

"కుమారా! శ్రీరామా! యీదివ్య మంత్రాలను నీవు ఉపాసించినందు వలన ఆకలి దప్పులు రెండూ నీకుండవు. బాహుబల సంపదలో నీయంతవాడీ లోకంలోనే ఉండడు. యీ మంత్రాల వలన పదునాలుగు భువనాల్లో నిన్ను మించిన వాడే ఉండడు" అనితన దివ్యాశీరుపాయనములను శ్రీరాము నౌదలపై వర్షింపచేశాడు తనసోదరుడు లక్ష్మణునకు మహర్షి అనుమతిని శ్రీ రాముడా మహామంత్రాలను ఉపదేశించాడు.

ఆరాత్రి ఆముగ్గురూ పట్టు తివాసీలు లాగుండే పచ్చని గడ్డిపై నిద్రించారు. ఉషః కాలమున మహర్షి ఆ ఇరువురి రాకుమారులను మధుర మంగళ మందహాసముతో మేలుకొల్పాడు.

"కౌసల్యానందనా! తెలతెల్లవారుతోంది. నీవు యిప్పుడు సంధ్యావందనాది క్రియలు నిర్వర్తించాలి. తొందరగా మేలుకో! కుమారా! అన్నాడు ముని.

అప్పుడు యిద్దరూ లేచి స్నాన సంధ్యాదిక్రియలు నిర్వర్తించి, బ్రహ్మర్షి విశ్వామిత్రునకు సాష్టాంగ నమస్కారాలు చేశారు. ముగ్గురు ముందుకు ప్రయాణం కట్టారు. అంగ దేశాన్ని అతిక్రమించి సాయం సమయానికి సరయూ గంగానదుల సంగమానికి చేరారు. అచ్చట హాయిగా ఆ రాత్రి గడిపారు. అచట మహర్షుల ఆతిధ్యాన్ని స్వీకరించారు. మరునాడు గంగానదిని దాటి దక్షిణ దిశగా ప్రయాణం గావించి అరణ్యాన్ని ప్రవేశించారు.

## తాటక

"శ్రీరామ! కొంతకాలము క్రిందట యీ అరణ్య భూభాగమంతా కనులకింపు నింపు ఉద్యానవనాలూ – దివ్య మంగళ భవనాలూ – పక్షుల కిలకలా రావాలతో సహృదయం గల సజ్జనులతో యెంతో ఆనందంగా ఉండేది. దైవవశాత్తు యిక్కడ ఒకయక్షుని కూతురు చేరింది "తాటక" అని దానినామము. దాని కుమారుడే మారీచుడు. సునందుడు దాని భర్త. యిక చెప్పవలసినదేముంది? యీ మహా పట్టణమునగల మునులందరినీ కుమారునితో కూడి ఆహారం చేసికొంది. అందువలన యీ ప్రదేశం మహారణ్యంగా మారింది. యక్షులలో యింత బలము గలవారులేరు. దీని తండ్రి బ్రహ్మ దేవుని తపస్సు వలన మెప్పించి బ్రహ్మ వరాన దీనిని పుత్రికగా కన్నాడు. అందువలన దీనికి వేయి యేనుగుల బలముంది. దాని కుమారుడు శాపం మూలంగా రాక్షసుడయ్యాడు. అగస్త్య మహర్షి వలన దీని భర్త హతుడయ్యాడు. ఆ తాటక తప్పక మనకిప్పుడు యెదురవుతుంది గో–సాధు హింస గావించే ఆ తాటకిని నీవు తప్పకుండా వధించాలి. అది స్త్రీ అనీ, దాని వలన పాపమనీ నీవు సంశయింప వలదు. దీని చావు వలన లోక కల్యాణం జరుగుతుంది. నీవు రాజువు కనుక ప్రజారక్షణ నీకవశ్య కర్తవ్యము, అని మహర్షి చెప్పగా శ్రీరాముడు

"మహాత్మా! మా పితృదేవుడు తమ రేమి చెప్పినా చేయమని మమ్మాదేశించారు" అని నారిని సారింపగ శ్రీరాముని నారిధ్వనికి ఆమహారణ్యమున గల మృగాలూ–క్రూరమృగాలూ భయభ్రాంతులయ్యాయి. ఆశబ్దము వినినతాటకి అదరిపడి– అంతధ్వని అదియెప్పుడూ వినలేదు. కనుక ఆధ్వనివైపు అడుగామడగా వచ్చి రామలక్ష్మణులపై బడబోవగా, మహర్షి రాకుమారులకు మంచిని పెంచేమహామంత్రాలను పఠించాడు.

" శ్రీరామా! యిది సాయం సంధ్యాసమయము. యిప్పుడు రాక్షసులకు బలమధిక మవుతుంది. తక్షణం దానిని వధించు, అనగా శ్రీరాముడు శబ్ధభేదిని వేయగా తాటక ఆ దెబ్బకు విలవిల కొట్టుకొని రామునిపై పడబోగా యింకొక బాణంతో దాన్ని వేయ అది ప్రాణాలు వదిలింది.

ఆ రాత్రి అచ్చట ఉండి మరునాడు ప్రాతః కాలాన లేచి సంధ్యావందనాది క్రియలు నిర్వర్తించి మహర్షి "శ్రీరామా! నీకు పదునాలుగు భువనాలలో గల యెటువంటి వీరునైనా వధించడానికి తగిన అస్త్ర శస్త్రాలను ఉపదేశిస్తాను" అని "విష్ణు చక్ర – కాలచక్ర – ధర్మచక్ర – దండచక్ర – ఐంద్ర – ఐషీక – వజ్ర – ఆగ్నేయ – వాయవ్య వారుణాస్త్రాలను ప్రయోగోప సంహారణాలతో శ్రీరామునకు ఉపదేసించి ప్రయాణం కట్టారు.

యిలా కొంత దూరం సాగారు విశ్వామిత్రుని ఆశ్రమప్రాంత భూమికి ముగ్గురూ చేరారు. ఆ ప్రాంతమున మునులందరూ వారికి స్వాగతోక్తులు పలికారు. మహర్షి దీక్షబూనాడు.

"శ్రీరామా! యీ దినం మొదలు ఆరు దినాలు యీ యాగదీక్ష ఉంటుంది. అప్పుడు దీక్షాబద్ధుడై మహర్షి మౌనంలోనుంటాడు. అని వారందరూ చెప్పారు. రామలక్ష్మణులు అతి జాగరూకతతో యాగాన్ని పరిరక్షిస్తున్నారు.

## మారీచ సుబాహులు

సరిగా యాగము పరిసమాప్తం అయ్యే సమయాన ఆకసము నుండి భయంకర శబ్దాలూ - అట్టహాసాలు - వికటముగా నవ్వులూ విన్పించాయి. ప్రళయకాల మేఘ శరీరాలతో మారీచ సుబాహులిద్దరూ రాక్షసులతో వచ్చారు. అప్పుడు శ్రీరాముడు వాయువ్యాస్త్రము వేశాడు. ఆ అస్త్ర శక్తికి తాళలేక మారీచుడు గిరగిర తిరిగి సాగర తీరాన బ్రతుకు జీవుడా అని పడ్డాడు. సుబాహునిపై ఆగ్నేయాస్త్రము వేసి వానిని భస్మము గావించాడు. వాయవ్యాస్త్రముతో తక్కిన రాక్షససేనను దిగంతాలకు పట్టించాడు.

యాగము పూర్ణాహుతి అయింది. శ్రీరామ లక్ష్మణులకు విశ్వామిత్రుడు పరమానంద మంది వారి శిరాలు మూర్కొని దివ్యాశీస్సులిచ్చాడు.

ఆ రాత్రి అట విశ్రమించారు. తూర్పు దిక్కు అరుణారుణ కాంతులను విరజిమ్ముతోంది. వేగం సంధ్యాక్రియలు నిర్వర్తించారు. శ్రీరామలక్ష్మణులు విశ్వామిత్రునికి వందనలర్పించి చేతులు కట్టుకొని నిలబడ్డారు.

"రామ! మిధిలాధిపతి జనక రాజేంద్రుడు జరుపు యజ్ఞానికి మనము వెళ్లాలి. నాతో మీరూ రావాలి. శివుని ధనువు ఆయన భవనాన పూజలందుకొనుచున్నది. సుర సిద్ధ సాధ్య దేవదానవ పన్నగ గంధర్వు లెవ్వరూ దాన్ని యెత్తలేరు. బలసంపన్నులైన రాకుమారు లెందరో దానిని యెత్తి యెక్కుపెట్టాలని నిర్ణయించినా యెవ్వరికీ సాధ్యముకాలేదు.

మునులను తిలకించి నేను మిధిలనుండి హిమాలయములందుగల గంగానదీ తటమున తపస్సుగావిస్తాను. మీకందరకూ భగవానుడు రక్షణ కల్పించుగాక!

సరిగా సూర్యభగవాను డస్త్రాద్రికి చేరు సమయానికి శోణనది ఒడ్డుకుచేరి స్నానాది సంధ్యక్రియలు నిర్ణయించి, అగ్నిదేవుని అర్చించి ఆరాత్రి అచ్చట విశ్రమించారు.

## గంగ భూమికి దిగుట

మామూలుగా మహర్షి శ్రీరామలక్ష్మణులను నిద్రలేప వారు స్నాన సంధ్యాది క్రియలు నిర్వర్తించారు. ప్రయాణము సాగించారు. మహర్షిని వెనుకొని రాకుమారులు ఆనందోత్సాహాలతో నడుస్తున్నారు. పరమ పావని గంగానదీమ తల్లిలో స్నానాదులు ముగించి. పితృతర్పణాలు గావించి అగ్నిదేవునర్చించి హాయిగా భోజనాదులు చేశారు. అటగల మహర్షులు విశ్వామిత్రునకు నమస్సులర్పించి కూర్చున్నారు.

"శ్రీరామా! యీ గంగానది తన పవిత్రతతో ముల్లోకాల్లోనూ రంగదుత్తుంగ తరంగాలతో ప్రవహిస్తు అందరను పవిత్రులనుగా చేస్తుంది. యీ మహానది హిమగిరికి జ్యేష్ఠపుత్రికా మణి సురసిద్ధ సాధ్యులగు దేవతలూ – రాక్షసులూ – రసాతలవాసులు పన్నగులూ యీ నదినారాధిస్తారు. అంతేకాదు దేవతలందరూ యీ మహానదీమ తల్లిని దేవలోకానికి తీసికొనివెళ్లారు.

సగర చక్రవర్తి ముని మనుమడు భగీరథచక్రవర్తి యీమెను దేవలోకమునుండి, భూలోకానికి కొనితెచ్చాడు. యీతడు పవిత్ర ప్రభావముగల మీ సూర్యవంశము నందు పుట్టినవాడే.

సగరచక్రవర్తికి అర్ధాంగులిద్దరు "కేశిని – సుమతి" అని వారి పేర్లు. యెప్పటికీ సగరునికి సంతానము లేక మహిమాలయమైన హిమలయమున అర్థాంగులతో తపస్సు మహత్తరముగా గావించినాడు.

అంతట భృగువు ప్రసన్నతతో ప్రత్యక్షమై "చక్రవర్తీ! నీ ఒక భార్య మీ వంశాంకురాన్ని ప్రసవిస్తుంది. రెండవ ఆమె అరువేల మంది పుత్రులను కంటుంది" అని వరమిచ్చి సగరునికి పంపాడు.

యిలా కొంత కాలము జరుగగా అసమంజసునికి కేశిని జన్మనిచ్చింది. అరువది వేలమంది కుమారులను సుమతీ కాంత ప్రసవించింది. వీరి నందరినీ నేతి కుండలలో బహుభద్రముగా ఉంచి పంచారు. వీరు దినదినాభి వృద్ధితో అమావాస్య వెళ్లిన తరువాత చంద్రునిలా పెరుగుతున్నారు.

అసమంజసుడు యీ పిల్లలతో తనకు అందిన వారిని ఊరావలగల నదిలో పారవేశాడు. యీ విషయం తెలిసిన రాజు ఆతనిని తన దేశము నుండి పారద్రోలాడు. ఆతని కుమారుడు మాత్రము అంశుమంతుడు మంచి మనస్సుతో సర్వ ప్రజామోద యోగ్యాన్ని పొందాడు.

సగర చక్రవర్తి అశ్వమేధయాగాన్ని ప్రారంభించాడు. అశ్వమేధ అశ్వాన్ని విడువగా దాని వెనుక అంశుమంతుడు బయల్దేరాడు. ఆ అశ్వాన్ని మహేంద్రుడు దొంగిలించాడు. సగరుడు అశ్వమేధ అశ్వాన్ని తీసికొని రమ్మని అరువది వేలమందినీ పంపాడు. వారు భూలోకమంతా వెదకినారు. గుఱ్ఱము కానరాలేదు. అప్పుడు వారు భూమిని త్రవ్వడము ప్రారంభించారు. వారు ముందుగా తూర్పుదిక్కున ఉన్న "విరూపాక్షము" అను దిగ్దంతికి హృదయపూర్వక నమస్సు లర్పించారు. దక్షిణ దిక్కున గల "పద్మము" అను నామముగల దిగ్దంతికి వందన లర్పించారు. పడమరలో నున్న "సౌమనస" దిగ్గజానికి సుమనస్సులర్పించారు. ఉత్తర దిశలో గల "భద్రమను" దిగ్గజానికి వందన చందనలు అర్పించారు. యిలా ఆనందముతో వెళుతూ గుఱ్ఱము తప్పక దొరుకుతుందనే ఆశతో ఈశాన్య దిశగా వారు పోయి శ్రీ కపిల మహర్షి ఆశ్రమము దగ్గర చేరారు.

మహర్షి యొక్క ప్రభావాన్ని తెలియక ఆరాకుమారులు మహా కోపముతో " ఓరి మాయావీ! మాయాగాశ్వన్నే దొంగిలించావా! మూర్ఖుడా! మా సంగతి నీకేమి తెలియునురా" అని భీకరముగా గద్దించారు. దాంతో మహర్షి పట్టరాని కోపోద్రేకముతో బాగా గాలిని లోనికి పీల్చి భయంకరముగా ఆ గాలిని విడువగా, అరువది వేలమంది సగరుని కుమారులు భస్మపు కొండయ్యారు.

ఎంతో కాలము గతించింది. తాను చేస్తున్న యాగమా ఆగిపోయింది. గుఱ్ఱాన్ని తీసుకొని వస్తామని వెళ్లిన కుమారులు తిరిగిరాలే"దని సగర చక్రవర్తి అంశుమంతుని పంపాడు.

ఆతడు అలా భూమండల మంతా తిరిగి తిరిగి వేసారి తుదకు యాగాశ్వము దగ్గరకు వచ్చాడు. తన పిన తండ్రులు అరువది వేల మంది కానరాలేదని దుఃఖింప సాగాడు. అదిగని కరుణార్ద్ర హృదయుడగు గరుత్మంతుడు

"కుమారా! అటు చూడు; యీ భస్మపు కొండ నీ పిన తండ్రులది. వారు భగవంతుడైన కపిలమహర్షిని అవమానకర వాక్యాలాడి ఆతని కోపాగ్నికి యిలా భస్మమయ్యారు. వీరు సజీవులవాలంటే దివిలో గల పవిత్ర గంగా నదిని భువికి దింపాలి ఆ గంగను వీరిపై ప్రవహింపచేయాలి. అప్పుడు వీరు సజీవులై పునీతులౌతారు. అదుగో యాగాశ్వము. దానిని తీసికొని వెళ్లి ముందుగా నీ తాత అశ్వమేధ యాగాన్ని పూర్తిగావించు" అని పంపాడు.

తాత దగ్గరకు వచ్చి విషయాన్ని చెప్పి అశ్వమేధయాగాన్ని పూర్తిగావించాడు. కొంతకాలానికి దిలీపుని కుమారుడు భగీరథుడు సామ్రాజ్య సింహాసనాన్ని అధిరోహించాడు. తన తాతలకు స్వర్గసుఖాలను కల్పించాలని సంకల్పించాడు. దివిజ గంగాభవానిని భువికి దింపాలని మహా దీక్షా దక్షుడై పరమ పావనమైన గోకర్ణ క్షేత్రమున మహత్తర తపము గావించాడు. అప్పుడాతనికి బ్రహ్మదేవుడు ప్రత్యక్షమయ్యాడు. ఆతనికి తన మనస్సులో గల కోరికను విన్న వించాడు. "భగీరథా! నీ కోరిక గొప్పదే! అయినా దివి నుండి భువికి దిగిన గంగను భరింపగలవాడు పరమ శివుడొక్కడే అనగా భగీరథుడు తన పట్టు వీడక పరమేశ్వరుని గూర్చి ఘోరమైన తపస్సు గావించాడు. శివుని దివ్యానుగ్రహముతో గంగాదేవిని ఆతని జటా జూటము మీదికి అవతరింప చేశాడు. అచ్చట బిందు సరస్సులోనికి గంగను దింపాడు. అలా గంగాదేవి దిగి యేడు మార్గాలుగా విడి ప్రవహించింది.

అలా యేగగా ప్రవహించే గంగాదేవి " నళిని – పావనీ – హ్లాదినీ " అను పేర్లతో తూర్పుదిశగా; "సుచక్షస – సీత – సింధు" పేరులతో పడమరగా; ఏడవది భగీరథునితో వచ్చి "భాగీరథి" అయింది. అలా వెళ్లగా జహ్ను మహర్షి దివ్యాశ్రమాన్ని ఆనది ముంచింది. మహర్షి ఒక్క బిందువు మిగులకుండా దాన్ని త్రాగివేశాడు. దేవతలందరూ ఆ మహర్షిని అనేక విధాల ప్రార్థింపగా అప్పుడుడాతడు చెవిలో నుండి విడిచాడు. అందువలన గంగాదేవి "జాహ్నవి" నామముతో పిలవబడింది.

భగీరథుడు అలా తన వెంట గంగాదేవిని తీసికొనివచ్చి తన తాతల భస్మరాశిపై ప్రవహింప చేశాడు. వారికి స్వర్గాది భోగాలు కల్పించాడు. యిదే దివి నుండి భువికి దిగిన గంగా భవాని చరిత్ర” అని మహర్షి చెప్పగా రామలక్ష్మణులు విని పరమానందమందారు.

## అహల్యాదేవి

విశ్వామిత్ర మహర్షి రామలక్ష్మణ రాకుమారులకు దారిలో యిలా అచ్చటచ్చట గల స్థలచరిత్రలను రమణీయముగా చెప్పుతూ, వారికి మార్గాయాసము కానరాకుండా చేస్తుండగా, మహాసంతోషముతో వారు కూడా. ఆ కథలను వింటూ ఉత్సాహము గలవారై మహర్షిని యింకా కథలను వినిపించమని కోరుచున్నారు.

ఆ రాత్రి వారచ్చట హాయిగా నిద్రించారు. ఉషఃకాలాన లేచి స్నానాది క్రియలు నిర్వర్తించి గంగానదిని దాటి వెళ్లుచున్నారు.

జనక రాజేంద్రుని మిథిలా నగరము సమీపాన కన్నులకు – హృదయానికి ఆనందాన్నందించే ఒక్క దివ్యమైన ఉద్యానవనము కాన వచ్చింది. మహర్షిని మోద మానసముతో శ్రీరాముడు చూడగా

“రామభద్రా! ఒకప్పుడిది సర్వ జనావళితో యెంతో ఆనందముతో కళకళలాడుతుండేది. సుర సిద్ధ సాధ్య కిన్నెర కింపురుషాది దేవతలందరూ యిచ్చట నిత్యమూ విహరిస్తుండేవారు. అందరూ ఆనందముతో నున్న యిచ్చట గౌతమ మహర్షి ఆశ్రమాన్ని నిర్మించి తపస్సు చేసికొనేవాడు. అతని అర్ధాంగి అతిలోక సౌందర్య సౌశీల్యవతి అహల్య.

## ఫుట్ నోట్

సృష్టిలో యెచ్చటా యిప్పటికి తాను సృష్టించనట్టి ఒక కాంతను బ్రహ్మదేవుడు తన ఆత్మతో సృష్టి చేశాడు. అయితే ఆమెకు పేరు పెట్టాలి. ఒక కవికి తాను వ్రాసిన గ్రంథానికి పేరు పెట్టడములోనే ఆతని సంస్కారము – ప్రతిభ కానవస్తుంది. అలాగే బ్రహ్మదేవుడు కూడా తన పుత్రికకు యేమిపేరుంచాలి? అని ఆలోచించాడు. “హల్ వక్రత్వ ముచ్యతే సర్వాంగేష్వపి యద్రూపే నాస్తి వక్రతా అహల్యాం విధి మబ్రవీత్” యీామె సర్వాంగాలందూ యెక్కడా వక్రత లేనిమూలముగా యీామెకు “అహల్య” అని పేరు పెట్టాడు.

అహల్య శరీర సౌందర్యమే కాదు ఆత్మ సౌందర్యం – ఆధ్యాత్మిక సౌందర్యం కలది. అలా ఆమె గౌతమ మహర్షి యొక అర్ధాంగిగా ముల్లోకాల్లో మంచి పేరు సంపాదించింది.

యెప్పటినుండో మహేంద్రుడు ఆమెను పొందాలనుకొని సమయము కొరకు వేచి తుదకు తెగించి మహర్షి శిష్యులకు విద్యను బోధించు బడి పంచను కాచుకొని ఉండి రాత్రి పదిరెండు గంటల సమయాన కోడియై కూసాడు.

తన అలవాటు ప్రకారము మహర్షి కోడి కూతతో లేచి స్నానానికి వెళ్లాడు. అదే సమయమని మహేంద్రుడు మహర్షి రూపముతో ప్రవేశించి వెలుగుచున్న దీపాన్ని ఆర్పబోగా అది గ్రహించిన అహల్య “ఎవడవురా! అని కను రెప్పలు పడకుండాను ఆతనిని మహేంద్రునిగా నెంచి యెంతగానో చీవాట్లు పెట్టింది. కాముకునికి కన్నులు కానరావుకదా!

యింతలో మహర్షి వచ్చాడు. అంతకుముందే అహల్య స్వయముగా ధర్మదేవత వచ్చి నన్నంటు వరకూపాషాణ రూపాన ఉంటానని తన పాతివ్రత్యముతో పాషాణముగా మారింది మహేంద్రు డిదంతా చూచి ఒక మూల సిగ్గుతో నున్నాడు. గౌతమ మహర్షి ఆవిషయమంతా తన తపో నేత్రముతో చూచి గ్రహించెను. బాగా దేవేంద్రునికి చీవాట్లు పెట్టాడు. ఓరి మూర్ఖుడా? మా యిద్దరికి వియోగాన్ని కలిగించావు నీవు విఫలుడ వౌదువు గాక (విఫలుడు అండములు లేనివాడు) అని శపించాడు. భార్య గూర్చి యెంతగానో తపించాడు రామా! నీవు స్వయంగా ధర్మదేవతవు “రామో విగ్రహన్ ధర్మః” అని అంటుండగా పెద్ద పాషాణము. కాలుకి తగిలి ఒక త్రిలోక సుందరిగా నిలిచింది ఆశ్చర్యముతో రాముడు మహర్షి వంక చూచాడు యింతలో గౌతమ మహర్షి వచ్చి శ్రీరామ చంద్రమూర్తికి వందనము లర్పించాడు శ్రీరామ చంద్ర! నీవు సాక్షాత్తు పర పరబ్రహ్మవు అనగా అహల్య గౌతమ మహర్షు లిద్దరు శ్రీరాముని పూజించారు. విశ్వామిత్ర మహర్షి ఆ దంపతికి వందన చందన లర్పించాడు. యిది శ్రీ రామునికి మరీ వింతగా అయినది. మహర్షి రామా యీ చరిత్ర తరువాత చెప్పుతాను. అని ముగ్గురు మిథిలా నగరం వైపు నడిచారు.

## శివుని విల్లు భంగము

జనక మహారాజు విశ్వామిత్ర మహర్షికి అర్ఘ్యపాద్యాదులు అర్పించిఉచితా సనము పై కూర్చుండ బెట్టి బ్రహ్మర్షి చంద్ర! యీ యాగము మనయోగము! యింకా పదిరెండు రోజులలో పరిపూర్తి అవుతుంది. అంత వరకు తమరు మా ఆతిధ్యాన్ని స్వీకరించి యిక్కడే వుండ ప్రార్థిస్తాను” అని చేతులు జోడించాడు మీ వలన నేనూ మా వంశము మా రాజ్యము మహత్తరధన్యత్వము పొందగలిగేము.

మహాతేజస్వరూపులు క్షాత్రధర్మ విరాజితులు యీయువకు లెవరో ఆశ్వనీదేవతలు వలె వెలుగుచున్నారు. వీరిని గూర్చి నేను తెలుసుకొనవచ్చునా?

మహారాజా! వీరు అయోధ్యాపతి దశరథ రాజుకుమారులు నాయాగ సంరక్షణార్థము వీరిని తీసుకొని వచ్చాను. మాయాగాన్ని భగ్నము చేయడానికి వచ్చే రాక్షసులను వీరు చంపేరు అహల్య శాప విమోచనము గావించి ఆమెను గౌతమ మహర్షికి అర్పించారు. యిందు పెద్దవాడు శ్రీరాముడు రెండవవాడు లక్ష్మణుడు. అనేసరికి జనకుని పురోహితుడు శతానందుడు రామలక్ష్మణులకు

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Sampurna+Ramayanam**

* * *